

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**విమానం దిగి** నడుస్తుండగా ఎంతో దిగులు కలిగింది. పోయిన వారంలా కాక ఇప్పుడు అన్నయ్య నాకోసం ఎదురు చూస్తూ ఉండడు. ఎవరు వస్తారో, ఎప్పుడు వస్తారో, ఎలాంటి వాళ్ళో, ఏమీ తెలియదు. ఇప్పుడు నేను ఇంటికి కాక రూముకి వెళ్ళాలి. అన్నయ్య చెప్పినట్లు మంచి వాళ్ళు కాకపోతే? ఈ ఊళ్ళో ఎవరూ తెలియదు. ప్రతిదానికి సహాయం కావాలి కనుక సర్దుకుపోవాలి. అన్నయ్య నా కంచంలో తిన్నా ఊరుకునేదాన్నికాదు. ఇప్పుడు ముక్కూ మొహం తెలీని వాళ్ళతో అడ్జస్ట్ అవ్వాలి. ఇలా ఆలోచిస్తుండగా దిగులు తన్నుకొచ్చింది. వెంటనే బాత్ రూంలోకి వెళ్ళి భోరున ఏడ్చాను. అద్దంలో మొహం చూస్తే కళ్ళన్నీ ఎర్రగా ఉన్నాయి. బిత్తరపోయాను. మొహం మీద కాస్త నీళ్ళు చల్లుకుని కొద్దిసేపు కళ్ళు మూసుకునే ఉన్నాను. ఆ తరవాత బయటకి నడుస్తూ ఫోన్‌ని ఎయిర్ ప్లేన్ మోడ్‌లోంచి తీసాను. వెంటనే అన్నయ్య పంపిన "బోన్ వొయాజ్," "డిడ్ యు లాండ్" మెసేజెస్ వచ్చాయి. మళ్ళీ ఏడుపు మొదలైంది. కళ్ళు తుడుచుకుంటూ బాగేజ్ క్లైం వైపుగా నడిచాను. ఇంతలో ఫోన్ మోగింది.

"హలో" గొంతు సవరించుకున్నాను.

"ఐం నిర్మల్ ఫ్రం ఇండియన్ స్టూడెంటసోసియేషన్" అన్నాడు.

"హేయ్, ఐ నియర్ బాగేజ్ క్లైం" అన్నాను.

"కరూసల్ నంబర్ 2"

అర్థంకాక "వాట్?" అడిగాను.

"యూర్ బాగ్స్ షుడ్ బి ఎట్ కరూసల్ నంబర్ 2" అన్నాడు.

"ఓకే. ఐ విల్ గో దేర్"

"వియార్ రైట్ హియర్"

ఇంతలో అతను కనబడ్డాడు. "హేయ్" అని ఫోన్ కట్ చేసాను.

"ఐం నిర్మల్, ప్రెసిడెంట్ఆఫ ఇండియన్ స్టూడెంట్ అసోసియేషన్. హి ఈజ్ 'వికాస్' వైస్ ప్రెసిడెంట్" అని పక్కన ఉన్న వ్యక్తిని పరిచయం చేసాడు.

"హా. థాంక్యూ ఫర్ పికింగ్ మి అప్" ఇంతలో నా సూట్ కేస్ కనబడడంతో ఎత్తే ప్రయత్నం చేసాను. కొన్ని సెకండ్లు కష్టపడ్డాక వారు సహాయం చేసారు.

"ఒరేయ్, ఇంత బరువుంది. ఇందులో ఏమున్నాయిరా" వికాస్ అన్నాడు.

"ఏమోరా. కనుక్కోమంటావా?" కుళ్ళుజోకువేసాడు నిర్మల్.

"జస్ట్ వన్?" వికాస్ అడిగాడు.

"నో త్రీ" బదులిచ్చాను.

"వామ్మో. మూడటరా. అవీ ఇలానే బరువేమో?" నిర్మల్‌తో అన్నాడు.

ఏం సమాధానం ఇవ్వాలో అర్థంకాక నిశబ్దంగా ఉన్నాను. మిగిలిన రెండు పెట్టెలని నేనే ఎత్తే ప్రయత్నం చేసాను కాని నావల్ల కాలేదు.

"లెట్స్‌గో" గబగబా వాళ్ళు తలో సూట్ కేస్ తీసుకుని బయటకి నడిచారు. నేను ఓ స్ట్రోలర్, ఓ పెద్ద పెట్టెని తోసుకుంటూ వాళ్ళ వెంటే పరిగెత్తాను. మొదట్లో రెండిటినీ తొయ్యడం కష్టమైనా నిదానంగా అలవాటైంది. వారు ఒక్కసారి కూడా వెనక్కి తిరిగి నేను వస్తున్నానో లేదో చూడలేదు. అదృష్టవసాత్తు చిన్న ఎయిర్‌పోర్ట్, తక్కువ జనాలవల్ల వారివెంట వెళ్ళడం మరీ ఇబ్బంది కాలేదు. కారులో సూట్ కేసులు పెట్టాక నిర్మల్ డ్రైవ్ చెయ్యడం మొదలు పెట్టాడు.

"సుఖీ క్రికెట్ టీంలో జాయిన్ అవుతాడటరా" వికాస్ అన్నాడు.

"వాడు చాలా సోదిరా. వాడికి బాట్ పట్టుకోవడం కూడా సరిగ్గా రాదు" నిర్మల్ బదులిచ్చాడు.

"ఒకటే చంపుతున్నాడురా, నువ్వు వాడికి ఫోన్ చెయ్యి."

"నాతో కాదురా. నువ్వే డీల్ చెయ్యి."

"పోనీ సుమంత్ వాళ్ళ టీంలో జాయిన్ అవమంటా"

"విక్రం వాళ్ళ దాంట్లో తక్కువమంది ఉన్నారు. అది బెటర్"

అలా వాళ్ళు ఏదో మాట్లాడుకుంటుండగా అన్నయ్యకి కారులో ఉన్నానని మెసేజ్ పంపాను. అది తెలిసినట్టే, "డిడ్ యు టాక్ టు యువర్ బ్రదర్?" వికాస్ అడిగాడు.

"యా. ఐ జస్ట్ టెక్స్టెడ్ హిం" అన్నాను.

"హి కాల్డ్ మి వెన్ యువర్ ఫ్లైట్ లాండెడ్ టు మేక్ షూర్ ఐం ఇన్ ది ఎయిర్ పోర్ట్" నవ్వాడు.

"ఓ..ఓకే"

"వాట్స్ యువర్ మేజర్?"

"ఏరో స్పేస్. యు?"

"కంప్యూటర్ సైన్స్. ఏరో స్పేస్ ఈజ్ వెరీ డిఫికల్ట్"

"రియల్లీ?"

"యా. మై ఫ్రెండ్స్ చేంజ్డ్ మేజర్ ఆఫ్టర్ ఫస్ట్ సెమిస్టర్"

"ఓ"

"యూ షుడ్ ఆల్సో చేంజ్" ఉచిత సలహా ఇచ్చాడు.

"వై?" కోపం దాచి అడిగాను.

"యు కాన్ట్ స్టడీ. ఇట్స్ వెరీ వెరీ డిఫికల్ట్"

"నేను కోపంగా ఏదో అనబోయేలోపు, "ఒరేయ్, నీ కెందుకురా?" నిర్మల్ అడిగాడు.

"ఏదో హెల్ప్ చేద్దామని" వికాస్ బదులిచ్చాడు.

"వాళ్ళ అన్నయ్య ఇక్కడే ఉన్నాడుగా, చూసుకుంటాడులే. తనకి ముందే తెలిసుంటుంది."

"వాళ్ళ అన్నయ్య ఏమైనా మన యూనివర్శిటీలో చదువుకున్నాడా తెలియడానికి?"

"అనవసరంగా వేలు పెట్టకురా. లాస్ట్ టైం గుర్తులేదా?"

"ఈ మనుషులే అంతరా. హెల్ప్ చేస్తే తప్పుగా అనుకుంటారు. ఇంతకీ వీళ్ళ అన్నయ్య ఏం చేస్తాడురా?"

"ఏమో, నాకేం తెలుసు? అదేదో చిన్నప్పటి నుండి ఫ్రెండ్స్‌లా అడిగావ్."

"వాట్ డజ్ యువర్ బ్రదర్ డు?"

"రిసర్చ్ సైంటిస్ట్" అన్నాను.

"వావ్. రిసర్చ్ సైంటిస్ట్ అటరా. తోపులా ఉన్నాడు. తినుకూడా అంతేనేమో. నా సలహాలు అక్కర్లేదులే ఇంక."

"ఇఫ్ యు డోన్ట్ మైండ్, వాట్స్ యువర్ బ్రదర్స్ ఏజ్?"

వీడికన్నీ కావాలా చమ్మ చక్క, నేను బదులివ్వలేదు.

ఈలోగా "వాట్ టైప్ ఆఫ్ రిసర్చ్?" నిర్మల్ అడిగాడు.

"బయోకెమికల్"

"ఇంట్రెస్టింగ్. మై గర్ల్ ఫ్రెండ్ ఈజ్ డూయింగ్ మాస్టర్స్ ఇన్ బయో టెక్నాలజీ."

గర్ల్ ఫ్రెండ్ గురించి ఇంత ఓపెన్‌గా చెప్తున్నాడేంటని ఆశ్చర్యపోయాను.

"హౌ ఈజ్ మార్కెట్?" అడిగాడు.

"ఐ డోన్ట్ నో"

"హౌ లాంగ్ డిడ్ ఇట్. టేక్ యువర్ బ్రదర్ టు ఫైండ్ జాబ్."

"హి వజ్ ఏన్ ఇన్‌టర్న్. నౌ హీజ్ ఫుల్ టైం."

"ఓ. నైస్. నైస్."

ఒక సెకండు నిశ్శబ్దం తర్వాత, "అయినా వాళ్ళ అన్నయ్యకి ఈజీగా దొరికేస్తుంది లేరా. మనకి కష్టం" వికాస్ అన్నాడు.

"ఔనులే కానీ ప్రయత్నించాలి కదా"

"వాళ్ళ అన్నయ్య రికమెండ్ చేస్తాడేమో అడుగు."

"అప్పుడే అడిగితే బావుండదు. సుధని పరిచయం చేస్తాను ముందు. తను అడిగితేనే బావుంటుంది."

ఈలోగా గాస్ స్టేషన్‌లో ఆపి, "వీ విల్ బి బేక్" అని ఇద్దరూ కారు దిగారు. లోపలికి వెళ్ళి కొన్ని నిముషాలకి బయటకి వచ్చారు. ఒకతను పెట్రోల్ కొడుతుంటే మరొకతను కాస్త దూరంగా వెళ్ళి సిగరెట్ కాల్చాడు. అది చూసి ఎంతో ఆశ్చర్యపోయాను.

తన సిగరెట్ పూర్తయ్యేంత వరకు ఇద్దరూ కబుర్లు చెప్పుకుని నిదానంగా కారెక్కారు. అసలు ఇలాంటి వాళ్ళతో కలవాల్సొస్తుందని ఊహించలేను. గర్ల్‌ఫ్రెండ్ ఏంటో, సిగరెట్ ఏంటో, ఈ జనాలేంటో. ఇంకా ఇలాంటి వాళ్ళు ఎంతమందిని కలవాల్సొస్తుందో. నా రూం మేట్‌కి బాయ్ ఫ్రెండ్ ఉన్నాడేమో. ఆ గోల నేను భరించలేను. ఆ అమ్మాయి ఇంట్లో చికెను, మటను వండినా ఆశ్చర్యపడక్కర్లేదు. ఇవన్నీ ముందే తెలిస్తే అసలు అన్నయ్య దగ్గరే ఉండి చదువుకునేదాన్ని. ఈ చీప్ అబ్బాయిల కారు ఎక్కే అవసరం వచ్చేది కాదు. నా ఆలోచనలవల్ల దిగులు రెట్టింపైంది.

"ఒరేయ్ గ్రీన్ కార్డ్ కాదేమోరా, సిటిజెన్ అయ్యుంటుంది."

"ఏక్సెంట్ లేదు కదరా."

"గ్రీష్మాకి కూడా లేదుగా."

"ఏమో. వాళ్ళ అన్నయ్య కూడా మామూలుగానే మాట్లాడాడు"

"అడిగి చూద్దామా?"

"ఒద్దు బాగోదు. తరవాత ఎలా అయినా తెలుస్తుంది మనకి"

"సైంటిస్ట్ అంటే గ్రీన్ కార్డ్‌కి జాబ్ వస్తుందా?"

"సుబ్బరంగా."

వాళ్ళు నా గురించి మాట్లాడుకుంటున్నారని ఖచ్చితంగా తెలిసింది. నాకు తెలుగు రాదని వీళ్ళ ఉద్దేశం కాబోలు. చీప్ పీపుల్.

"వెన్ డిడ్ యు కం టు యు.ఎస్?" ఆత్రం పట్టలేక అడిగేసాడు.

"లాస్ట్ వీక్."

"బి ఫోర్ దట్?"

"నో"

"ఒరేయ్ చెప్పనంటుందిరా" నిర్మల్‌తో అన్నాడు.

"తిక్క తిన్నగా కుదిరింది. నీకు నోటిదూల బాగా ఎక్కువరా."

"అయినా అంత చిన్న విషయం చెప్పడానికి ఏమైందిరా? ఎంత ఏ.బి.సి.డి అయితే మాత్రం మరీ ఇంత పొగరా"

వీళ్ళ అవసరం నాకు చాలానే ఉంటుంది కాబట్టి వీళ్ళతో స్నేహంగా ఉండాలి. అన్నయ్య చెప్పినట్టు ఎనిమీలు ఉండకూడదు. అమ్మ చెప్పినట్టు లౌక్యంగా ఉండాలి. అందుకు నాలో కోపాన్ని, అసహ్యాన్ని దిగమింగి "లాస్ట్ వీక్ ఫస్ట్ టైం వచ్చాను యూ.ఎస్‌కి. అంతకు ముందు ఎప్పుడూ రాలేదు" బదులిచ్చాను.

"నీకు తెలుగు వచ్చా?" ఇద్దరూ చాలా ఆశ్చర్యపోయారు.

"వచ్చు"

"మేము మాట్లాడింది అర్థమైందా?"

"సుబ్బరంగా."

"హే సారీ సారీ. మేము అలా అనలేదు. నువ్వు ఇండియానుండి కాక కొలరాడోనుండి వస్తుంటే నువ్వు ఇక్కడ అమ్మాయి అనుకున్నాము."

"ఓ, అందుకా" బదులిచ్చాను.

"నిజంగా సారీ. నువ్వు దేనికైనా హర్ట్ అయ్యావా?"

"లేదు. పర్లేదులే. డోన్ట్‌వరీ" పెద్దగా నవ్వసాగాను. వారూ నాతో కలిసి నవ్వారు.

"ఇదే నీ టెంపరరీ అకామడేషన్ ఇల్లు" కారాపుతూ చెప్పాడు నిర్మల్. ముగ్గురం కారు దిగాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story